సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 19 । జనవరి । 2025



బాల కార్మికులకు...

తప్పిపోయిన బాలలు, బాల కార్మికులకు బంగారు భవిష్యత్ ఇచ్చేలా ఆపరేషన్ స్మైల్ అండగా నిలుస్తోంది. 8లో



వనం వీడి జనంలోకి రండి

మావోయిస్టులు వనం వీడి జనంలోకి వస్తే ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 15°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

'వన విహారం'లో రాపత్తు సేవ



రాపత్తు సేవ జరుపుతున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో వైకుంఠ ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా రాపత్తు సేవలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామంలోని దేవస్థానం భూముల్లో ఉన్న వన విహార మండపంలో రాపత్తు సేవ జరిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యంలు అలరించాయి. కాగా రామాలయ బేడా మండపంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, హరిశ్చంద్ర నాయక్, రామిరెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలంటౌన్: రామాలయంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన పులగం రామకృష్ణారెడ్డి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయిలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి. పరంధామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో క్రికెట్, అథ్లెటిక్స్, హాకీ, ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో చెస్, క్యారమ్స్, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, స్విమ్మింగ్, ఖోఖో, యోగా పోటీలను జరుగుతాయని వివరించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వాలీబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 20 తేదీ లోపు హెచ్‌ఓడీ అధికారి అనుమతితో ఐడీ కార్డు, బయోడేటా ఫామ్‌ను జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు..

కొత్తగూడెంరూరల్: ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్స్, బ్యాంకింగ్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు నాలుగు నెలలపాటు బేసిక్ ఫౌండేషన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కె.సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు వచ్చే నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9553491432 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షల నిర్వహణకు 8 సెంటర్లు ఏర్పాటు చేయగా, 1,486 మంది విద్యార్థులకు గానూ 1,195 మంది విద్యార్థులు హాజరయ్యారు. 291 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. డీఈఓతోపాటు నవోదయ పరీక్షల ఇన్‌చార్జ్ బి.నరేష్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

'బ్యాడ్మింటన్' బ్రోచర్లు ఆవిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం): వచ్చే నెల 6 నుంచి 9వ తేదీవరకు కొత్తగూడెంలో నిర్వహించే బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ బ్రోచర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలోని హనుమాన్ బస్తీలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ బాధ్యులు కే.సావిత్రి, కే.రమేష్, రాసపెల్లి రాజేంద్ర ప్రసాద్, శ్రీలక్ష్మి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21, 22వ తేదీల్లో సింగరేణి మెడికల్ బోర్డ్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 21,22 తేదీల్లో కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో మెడికల్ బోర్డ్‌ను నిర్వహించనున్నారు. మొదటి రోజు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రెండో రోజు రిపోర్టుల ఆధారంగా అనారోగ్య సమస్యలను పరిశీలించి ఇన్‌వాలిడేషన్ చేస్తారు. అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు సంస్థలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు యాజమాన్యం 2018 నుంచి మెడికల్ బోర్డులు నిర్వహిస్తోంది.

మాజీలతో మాటా మంతీ !

- అడవుల్లో పరిస్థితి ప్రమాదకరంగా మారింది
- లొంగిపోతామంటే సాయం చేస్తామంటున్న మాజీలు
- నిలదొక్కుకునే వరకు అండగా ఉంటామన్న పోలీసులు

'సాక్షి'తో ముచ్చటించిన పోలీసులు, మాజీ మావోయిస్టులు



లొంగిపోయిన మావోయిస్టులతో ఎస్పీ రోహిత్‌రాజు, కొత్తగూడెం ఓఎస్‌డీ పంకజ్ పరితోశ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సుదీర్ఘ కాల అజ్ఞాత జీవితాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులతో జిల్లా పోలీసులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులతోపాటు పోలీసులతోనూ సాక్షి మాట్లాడింది. నిన్నామొన్నటి వరకు అజ్ఞాత జీవితం గడిపిన ఈ మాజీ మావోలు తమ వ్యక్తిగత పేర్లు, ఫొటోలను బయటి ప్రపంచానికి వెల్లడించేందుకు ఇష్టపడలేదు. కానీ తమ అభిప్రాయాలను నిర్మోహమాటంగా పంచుకున్నారు.

లొంగిపోతామంటే సాయం చేస్తాం

అజ్ఞాతంలో ఉంటూ అనారోగ్యం బారిన పడితే వైద్య సాయం దొరకడం కష్టంగా మారుతోంది. కాలు కదపలేని స్థితిలో కూడా కిలోమీటర్ల కొద్ది నడవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందువల్లే లొంగిపోయామని ఎక్కువ మంది చెప్పారు. మరికొందరు 'అందరికీ సమస్యలు ఉన్నాయి, ముందు మన సమస్యలు మనం పరిష్కరించుకోవాలి అందుకే లొంగిపోయాం' అని చెప్పారు. మళ్లీ అడవి బాట పట్టి అజ్ఞాతంలోకి వెళ్తారా అని ప్రశ్నిస్తే 'ఇక్కడ బాగానే ఉంది. మళ్లీ లోపలికి పోవడం ఎందుకు' అని ప్రశ్నించారు. అజ్ఞాతంలో ఉన్న మీ స్నేహితులు ఎలా ఉన్నారని ప్రశ్నిస్తే 'వారు ఒకప్పుడు మా స్నేహితులు ఇప్పుడు కాదు' అని బదులిచ్చారు. అజ్ఞాతంలో ఉన్న వారిని లొంగిపొమ్మని కోరతారా అన్న ప్రశ్నిస్తే 'అడవుల్లో బాగానే ఉంటుంది. కానీ ఇప్పుడయితే పరిస్థితి బాగాలేదు. మనం చెబితే వాళ్లు వినరు. కానీ లొంగిపోవాలని అనుకునే వాళ్లకు సాయం చేస్తాం' అని చెప్పారు.

నిలదొక్కుకునే వరకు..

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం అందించే సాయం బాగుందా అని ప్రశ్నించగా 'దళంలో ఉన్నప్పుడు పెద్దగా ఖర్చులు ఉండవు, ప్రధాన అవసరాలు అన్నీ పార్టీనే చూసుకుంటుంది. మా కుటుంబాల గురించి పెద్దగా ఆలోచించం. కానీ లొంగిపోయిన తర్వాత అన్నీ మొదటి నుంచి చేసుకుంటూ రావాలి. పునరావాసం కింద అందే ఆర్థిక సాయం కొద్ది మంది వృథా చేస్తున్న మాట వాస్తవమే. కానీ, చాలా మందికి ఇళ్లు కట్టుకోవడం, కొన్ని సామాన్లు కొనడం వంటి పనులతోనే ఆ డబ్బులు అయిపోతున్నాయి. ఆ తర్వాత వ్యవసాయం చేసుకోవడానికి బోర్లు, కరెంటు, ట్రాక్టర్లు వంటి ఆధునిక సౌకర్యాలకు డబ్బులు ఉండటం లేదు. లొంగిపోయిన మావోయిస్టులు తమ వ్యక్తిగత/కుటుంబపరమైన జీవితంలో నిలదొక్కుకునే వరకు ప్రభుత్వం అండగా నిలబడితే బాగుంటుంది' అని చెప్పుకొచ్చారు.

దేశంలో బెస్ట్ ప్యాకేజీ ఇదే

సరెండర్ ప్యాకేజీ గురించి పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ... 'లొంగిపోయిన వారం నుంచి పది రోజుల్లోపు నగదు రివార్డును బ్యాంకు ఖాతాలు తెరిచి చెక్కుల రూపంలో అందిస్తున్నాం. సరెండర్ మావోలు జీవితంలో నిలదొక్కుకునే వరకు అండగా నిలబడేందుకు ప్రయత్నిస్తున్నాం. తర్వాత కాలంలో ఇబ్బందులకు గురి కాకుండా జాగ్రత్త పడుతున్నాం. వారి జీవనశైలి మార్చే బాధ్యత మాది అనుకుంటున్నాం. అందువల్లే గడిచిన మూడేళ్ల కాలంలో ఈ జిల్లా నుంచి అజ్ఞాతంలో 36 మంది మావోయిస్టులు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య ఆరుకు పడిపోయింది. తెలంగాణ అందించే లొంగుబాటు ప్యాకేజీ ఆ తర్వాత మద్దతు బాగుండటం వల్లనే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కూడా ఇక్కడ లొంగిపోయేందుకు ముందుకు వస్తున్నారు. దేశంలో తెలంగాణ సరెండర్ ప్యాకేజీనే బాగుంది' అని చెప్పారు.

పదిహేనేళ్లయింది



నా కూతురు పేరు ఇడిమే. అజ్ఞాతంలోకి వెళ్లి పదిహేనేళ్లు అయ్యింది. మధ్యలో ఎప్పుడూ ఇంటికి రాలేదు. ఆమెను కలిసేందుకు ప్రయత్నించినా వీలుకాలేదు. ఈ మధ్య ఎన్‌కౌంటర్ల వార్తలు విన్నప్పుడల్లా భయమేస్తోంది. ఒక్కసారైనా నా బిడ్డను చూసుకోవాలని ఉంది. ఆమె లొంగిపోతే బాగుండు. అడవిలోనే బాగానే ఉంటుందనే నమ్మకంతోనే బతుకుతున్న.

– కనుము మైనయ్య

కలిసి పని చేద్దాం రండి



అజ్ఞాతంలో ఉన్న దామోదర్, ఆజాద్, వెంకటేశ్, చంద్రన్న, సుధాకర్ తదితర తెలంగాణకు చెందిన మావోయిస్టు నేతలు అందరూ లొంగిపోవాలి. ఇన్నాళ్లు అడవుల్లో ఉండి మీరు చేసిన అభివృద్ధి ఏమీ లేదు. మీ చర్యలు అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయి. జనజీవన స్రవంతిలోకి రండి. సొసైటీ డెవలప్‌మెంట్ కోసం కలిసి పని చేద్దాం.

–బి. రోహిత్‌రాజు, ఎస్పీ

కౌలు రైతుకేదీ భరోసా?

- రైతు భరోసా పథకం అమలుకు రంగం సిద్ధం
- క్షేత్రస్థాయిలో సాగు భూములను పరిశీలిస్తున్న అధికారులు
- సాయం కోసం ఎదురుచూస్తున్న 28 వేల మంది కౌలు రైతులు



పంటలో పైపాటు చేస్తున్న రైతు (ఫైల్)

బూర్గంపాడు: రైతు భరోసా పథకం అమలులో ప్రభుత్వం కౌలు రైతుల ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విస్మరిస్తోంది. రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల హామీ మేరకు ఎకరాకు రూ.15 వేలు కాకుండా రూ.12వేల పెట్టుబడి సాయమందిస్తామని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సాగుకు యోగ్యమైన భూములను గుర్తించి, గ్రామసభలు నిర్వహించిన అనంతరం రైతుభరోసా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఎన్నికల ముందు హామీ..

రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. గతేడాది వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వలేదు. యాసంగి సీజన్‌లో మాత్రం ఎకరాకు రూ.5 వేల చొప్పున అందించింది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పట్టాదారు రైతులు, కౌలురైతులు ఎవరికీ పెట్టుబడి సాయం అందలేదు. ఈ ఏడాది యాసంగి పంటల సాగు మొదలై నెలరోజులు కావొస్తున్న తరుణంలో పెట్టుబడి సాయమందిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రైతుభరోసా విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం కౌలు రైతుల ఊసెత్తకపోవటంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో కౌలు రైతులు కూడా పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

క్లస్టర్ల వారీగా పరిశీలన

రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది. గురువారం నుంచి క్లస్టర్ల వారీగా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండలు, నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్స్‌ను గుర్తించి నివేదికలను సిద్ధం చేస్తున్నారు. నివేదికల ఆధారంగా గ్రామసభలు నిర్వహించి రైతు భరోసా అందించే భూముల వివరాలను ఆయా గ్రామపంచాయతీల్లో ప్రదర్శించనున్నారు.

పంట ఉత్పత్తుల విక్రయాలకు సమస్యే..

జిల్లాలో సుమారు 28 వేలమంది వరకు కౌలు రైతులున్నారు. వీరంతా రెండు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. పట్టాదారులకు రైతు భరోసా అందుతుండటంతో భూమి సాగు చేస్తున్న కౌలురైతులకు ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. పంట ఉత్పత్తులు అమ్ముకునే సమయంలో కూడా కౌలు రైతులు పట్టాదారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. కౌలు రైతులను గుర్తించటం వారికి పెట్టుబడి సాయం అందించటంపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నారు.

భరోసా ఇవ్వాలి



ఎన్నికల హామీల్లో ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయమందిస్తామనని ప్రకటించింది. ఇప్పుడు రైతు భరోసా విషయంలో కౌలు రైతుల ఊసెత్తకపోవటం దారుణం. ఇచ్చిన మాట ప్రకారం కౌలు రైతుకు కూడా పెట్టుబడి సాయమివ్వాలి. పంటల సాగులో బాగా నష్టపోయేది కౌలు రైతులేనని ప్రభుత్వం గుర్తించి సాయమందించాలి.

–చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే..



రైతు భరోసా పథకాన్ని అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా అందించేలా చర్యలు తీసుకుంటాం. కౌలు రైతుల విషయంలో ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే నడుచుకుంటాం.

–బి.తాతారావు, ఏడీఏ, మణుగూరు

సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సింగరేణి(కొత్తగూడెం): సంక్షేమ పథకాల సర్వే ఆదివారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి, గ్రామసభల నిర్వహణకు సిద్ధంకావాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డ్‌లో కుటుంబ సభ్యుల పేర్ల నమోదుకు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వాటిని కూడా గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. జాబితాలో లేని అర్హులను గుర్తించి, వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వేలో కచ్చితమైన సమాచారం నమోదు చేయాలని ఆదేశించారు.

వేగవంతం చేయాలి

సంక్షేమ పథకాల సర్వే వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతిపై తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూభారతి పోర్టల్‌లో నమోదైన సాగు యోగ్యమైన భూములకు రైతు భరోసా కింద రూ. 12 వేలు చెల్లించనుందని చెప్పారు. సాగుకు అనుకూలంగా లేని భూములను గుర్తించి, పెట్టుబడి సాయం జాబితా నుంచి తొలగించాలన్నారు. ఇప్పటివరకు రెవెన్యూ 194 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన 160 రెవెన్యూ గ్రామాల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డు కోసం 29,141 దరఖాస్తులు వచ్చాయని, సభ్యుల పేర్లు చేర్పింపునకు సంబంధించి 10,796 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తులను పరిశీలించి నివేదికలు సమర్పించాలన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు చేయూత

ఐటీడీఏ పీఓ రాహుల్



అధికారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన విద్యార్థుల భవిష్యత్‌కు చేయూతనిచ్చేలా అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. శనివారం భద్రాచలం పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, గ్రంథాలయాన్ని సందర్శించారు. డైనింగ్ హాల్, డార్మెటరీ, గ్రంథాలయంలో రీడింగ్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేసీఆర్ కాలనీలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించారు. వివిధ రకాల పండ్ల మొక్కలు, మునగ, వెదురు మొక్కల పెంపకం చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అధికారులు అశోక్ కుమార్, హరీష్, శ్రీనివాస్, శ్రీనివాస్, అపర్ణ, వెంకటేశ్వరాచారి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో స్టూడెంట్ కౌన్సిలర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెంది, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఐటీడీఏలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 97041 78525 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. చర్ల, దుమ్ముగూడెం, టేకులపల్లి, సింగరేణి ఏకలవ్య పాఠశాలల్లో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఆకట్టుకునేలా విద్యుద్దీకరణ చేయాలి

భద్రాచలంటౌన్: మ్యూజియం ఆకట్టుకునేలా విద్యుద్దీకరణ చేయాలని, సెల్ఫీలు దిగే చోట తప్పనిసరిగా ఫోకస్ లైట్లు అమర్చాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. శనివారం ఆయన ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. మల్టీ కలర్ లైట్లు ఏర్పాటు చేయాలని, పిల్లల క్రీడల పరికరాలు అమర్చాలని పేర్కొన్నారు. రమణయ్య, అశోక్ కుమార్, హరీష్, హరికృష్ణ, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న అటవీ ఉత్పత్తులు

- సేకరణ లేక ఏటేటా ఆదాయం కోల్పోతున్న జీసీసీ
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.36.76 లక్షలు
- ఇప్పటివరకు కొనుగోలు చేసింది రూ.23.85 లక్షలే



పాల్వంచలోని జీసీసీ కార్యాలయం

పాల్వంచరూరల్: ఏజెన్సీలో గిరిజనులకు ఉపాధి, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే అటవీ ఉత్పత్తుల సేకరణ క్రమంగా తగ్గిపోతోంది. పోడు సాగు, అడవుల నరికివేతతో అరుదైన అటవీ ఫలసాయాన్ని అందించే చెట్లు అంతరించిపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏటా నిర్దేశిత లక్ష్యాన్ని జీసీసీ(గిరిజన సహకార సమితి) అధిగమించలేపోతోంది. తిరోగమనంలో పయనిస్తూ ఆర్థికంగా సన్నగిల్లుతోంది.

అటవీ ఉత్పత్తులను పరిశీలిస్తే..

జిల్లాలోని ఐటీడీఏ పరిధి గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట, మణుగూరు జీసీసీ బ్రాంచీలను, వాటి పరిధిలో 150 డీఆర్ డిపోలు నిర్వహిస్తున్నారు. అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలు, పంట ఉత్పత్తులు ధాన్యం, మిర్చి కొనుగోళ్లు చేపడుతున్నారు. పెట్రోల్ బంక్‌లు కూడా నిర్వహిస్తున్నారు. గత ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.36.76 లక్షల విలువైన అటవీ ఉత్పత్తులను సేకరించాల్సి ఉండగా, కేవలం రూ.23.85 లక్షల విలువైన ఉత్పత్తులను మాత్రమే సేకరించారు. ఇంకా రూ.12.91 లక్షల విలువైన ఉత్పత్తులు సేకరించాల్సి ఉంది. ఇందులో ముష్టిగింజల సేకరణ లక్ష్యం 217 క్వింటాళ్లు కాగా, 191 క్వింటాళ్లు సేకరించారు. ఇప్ప పువ్వు 282.66 క్వింటాళ్లు లక్ష్యంకాగా 16.94 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఇప్పబద్ద 254 క్వింటాళ్లకు గాను, ఇప్పటివరకు 335.27 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇప్పబద్ద మాత్రం లక్ష్యానికి మించి కొన్నారు. గతేడాది రూ.1.55 కోట్ల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా రూ.23.18 లక్షల విలువైన ఉత్పత్తులు మాత్రమే సేకరించారు.



నరమామిడిచెక్క, ముష్టిగింజలు, ఇప్ప పువ్వు

అసలు సేకరించనవి..

అగర్‌బత్తీల తయారీలో వినియోగించే నరమామిడి చెక్కకు జాతీయసాయి మార్కెట్‌లో గిరాకీ ఉంటుంది. అయినా గతేడాది నుంచి జీసీసీ కేజీ కూడా కొనుగోలు చేయలేదు. ఈ ఏడాది 10 క్వింటాళ్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా గ్రాము కూడా కొనలేదు. చింతపండు 20 క్వింటాళ్లు, గచ్చకాయలు 2 క్వింటాళ్లు, కానుగ గింజలు 20 కింటాళ్లు సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకుంది. ఆయా ఉత్పత్తులు గిరిజనుల సేకరించకపోడంతో కొనుగోళ్లు జరగడం లేదు. నరమామిడి, ఇప్ప చెట్లు అటవీ ప్రాంతంలో తగ్గిపోయినట్లు అధికారులు గుర్తించారు.

దళారుల వల్లే..

గిరిజనులు సీజన్‌లో సేకరించే అటవీ ఉత్పత్తులను జీసీసీ గ్రామాల్లోని సేల్స్ డిపోల ద్వారా కొనుగోలు చేస్తుంది. కొన్నేళ్లుగా దళారులు అటవీ ఉత్పత్తులను కొనుగోళ్లు చేస్తుండటంతో జీసీసీకి ఆదాయం తగ్గిపోతోంది. గిరిజన హాస్టళ్లకు సరుకులు జీసీసీ నుంచే కొనుగోలు చేయాల్సి ఉన్నా, వార్డెన్లు మాత్రం బయట మార్కెట్‌లో కొనుగోళ్లు చేస్తున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణపై పలువురు గిరిజనులు కూడా ఆసక్తి చూపడంలేదు. అటవీ ఉత్పత్తులను దళారులకు విక్రయించకుండా, డిపోల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించినా జీసీసీ అధికారులు నిర్లక్ష్యం వీడడంలేదు. ఫలితంగా రాబడి తగ్గింది. దీంతోపాటు బ్రాంచిలపై కొరవడిన పర్యవేక్షణ కూడా జీసీసీ తిరోగమనానికి మరో కారణంగా చెప్పవచ్చు.

సేకరణ తగ్గింది



జిల్లాలో గతంలో అటవీ ఉత్పత్తుల సేకరణ గణనీయంగా ఉండేది. అటవీ ప్రాంతంలో ఫలసాయం చెట్లు తగ్గిపోవడం, అటవీ ఉత్పత్తుల సేకరణలో గిరిజనులు ఆసక్తి చూపకపోవడంతో ఆశించిన స్థాయిలో అటవీ ఉత్పత్తుల సేకరణ జరగడంలేదు. దీంతో ఆదాయం లక్ష్యం క్రమక్రమంగా తగ్గిపోతోంది.

–నమ్మయ్య, జీసీసీ డీఎం

గౌందిగూడెంలో ఫారెస్ట్ స్టేషన్ ఏర్పాటు..

స్థల పరిశీలన చేసిన ఎఫ్‌డీఓ

అశ్వాపురం: మండల పరిధిలోని గౌందిగూడెం సెక్షన్‌లో బండ్లవారిగుంపు బీట్‌లో ఫారెస్ట్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని శనివారం ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మోహిద్దిన్, ఎఫ్ఆర్ఓ రమేష్ పరిశీలించారు. ముందే రూపొందించిన కంటైనర్‌ను అక్కడకు చేర్చి, స్టేషన్ నిర్వహించనున్నారు. అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేస్తుండగా, మణుగూరు మండలం కూనవరంలో గతంలో ఏర్పాటు చేయగా, ఇప్పుడు అశ్వాపురం రేంజ్‌లో ఏర్పాటుకు ఉపక్రమించారు. వీటి ఏర్పాటుతో అడవులు, వన్యప్రాణులు, అటవీ ఉత్పత్తుల సంరక్షణ పటిష్టంగా చేపట్టవచ్చని అటవీశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. స్టేషన్‌లో సిబ్బంది ఉండటంతోపాటు సామగ్రి భద్రపరచనున్నారు. వేసవికాలంలో అడవుల్లో చెలరేగే అగ్నికీలలను నియంత్రించే ఫైర్ బ్లోయర్స్‌ను కూడా ఇక్కడే ఉంచనున్నారు. బండ్లవారిగుంపు బీట్‌లో ఫారెస్ట్ స్టేషన్ ఏర్పాటుతో మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలైన తుమ్మలచెరువు, వెంకటాపురం, గౌందిగూడెం, గౌందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కట్టుదిట్టం కానుంది.



ఫారెస్ట్ స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ, ఎఫ్ఆర్ఓ

క్లుప్తంగా

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం..



దొంతికుంట చెరువును పరిశీలిస్తున్న మువ్వా విజయ్‌బాబు, ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతోపాటు ఆయన చెరువును పరిశీలించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ అయిన సందర్భంగా ఇరిగేషన్ శాఖ నుంచి నిధులు కేటాయించి చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త మున్సిపాలిటీకి కానుకగా ఈ చెరువును అందిస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు.

ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ చేయించండి



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

చండ్రుగొండ: ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కర్‌నాయక్ సూచించారు. మండలంలోని అయన్నపాలెంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలుంటాయని హెచ్చరించారు. వైద్యసిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఐఓ బాలాజీ, సీహెచ్ఓ నాగభూషణం, మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మికుల పొట్టకొట్టిన వాళ్లకు బుద్ధి చెప్పాలి'

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల పొట్టకొట్టిన టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీలకు ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాంబాబుయాదవ్ అన్నారు. సారపాకలోని ఐటీసీ ఈస్ట్‌గేట్ ఎదురుగా బీఆర్‌టీయూ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ఆయన మిత్రపక్షాల నాయకులతో కలిసి ప్రారంభించారు. గత 13వ వేతన ఒప్పందాల్లో ఈ రెండు ట్రేడ్ యూనియన్‌లు కార్మికుల హక్కులను కాలరాసి, వారి భవిష్యత్‌ను యాజమాన్యానికి తాకట్టు పెట్టారని ఆరోపించారు. కార్మికులు, వారి కుటుంబ సంక్షేమాన్ని గాలికి వదిలేసి యూనియన్ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలకు పెద్దపీట వేసుకున్నారని, గత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తొలిసారి బరిలో నిలిచి సత్తా చాటిన బీఆర్‌టీయూ ఈ సారి ఎన్నికల్లో విజయఢంకా మోగించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌టీయూ పోరాట పటిమ నచ్చి సీఐటీయూ, ఐఈయూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ట్రేడ్‌యూనియన్లు మద్దతుగా నిలిచాయని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మధుమహారాజ్, రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, ఏజే రమేశ్, గాదె మాధవరెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, బ్రహ్మాచారి, అబ్దుల్ సాబీర్, వెంకటేశ్వరరావు, బీఆర్‌టీయూ మిత్ర పక్షాల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మీదుగా ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత ఎండు గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కూనవరంరోడ్‌లోని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా ఓ ఇన్నోవా కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి దొరికింది. కారు డోర్లలో దాచిన 31.06 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను, కారులోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంజనీకుమార్‌తివారి, సంజీవ్‌కుమార్ అని తేలగా.. ఒడిశా రాష్ట్రం బలిమెలలో గంజాయి కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తూ దొరికారని, రెండు సెల్ ఫోన్‌లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని, గంజాయి విలువ రూ.8 లక్షలు ఉంటుందని సీఐ శ్రీనివాస్ వివరించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్ సుధీర్, హరీశ్, వెంకట్, విజయ్, హనుమంతరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు రాని ఐదుగురు రిమాండ్

కొత్తగూడెంటౌన్: కోర్టు వాయిదాలకు రాకుండా తప్పించుకు తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులపై శనివారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసి కోర్టులో హాజరుపరిచి భద్రాచలం సబ్ జైలుకు తరలించారు. చండ్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత కేసుల్లో ఐదుగురు నిందితులు కోర్టుకు హాజరు కాకుండా ఉండటంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. కేసుల్లోని నిందితులు కరిసెలబోడు తండాకు చెందిన గుగులోత్ సరళ, గుగులోత్ శ్రీను, గుగులోత్ అనిల్, భూక్యా ప్రవీణ్, బానోత్ బాల్యను పోలీసులు అరెస్టు చేసి కొత్తగూడెం జిల్లా కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఐదుగురు నిందితులను భద్రాచలం సబ్ జైలుకు తరలించినట్లు చండ్రుగొండ పోలీసులు తెలిపారు.

బాల కార్మికులకు భరోసాగా..

- ఈ నెల 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- మూడేళ్లలో 215 మంది బాలకార్మికుల గుర్తింపు..



కొత్తగూడెంలో బాల కార్మికుల గుర్తింపునకు దర్యాప్తు చేస్తున్న రెస్క్యూ బృందం

కొత్తగూడెంటౌన్: తప్పిపోయిన బాలలు, అనాథలు, బాల కార్మికులుగా ఉన్న పిల్లలను గుర్తించి, వారికి బంగారు భవిష్యత్ ఇచ్చేందుకు ఆపరేషన్ స్మైల్ అండగా నిలుస్తోంది. బాల కార్మికులను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. జనవరి 1వ తేదీ నుంచి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా 2022 నుంచి 2025 వరకు 215 మంది బాల కార్మికులను గుర్తించారు. వారికి సీడబ్ల్యూసీ ఆదేశానుసారం విద్య, వైద్యం, వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రుల ఆలనకు దూరమైన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, అనాథలుగా, బాల కార్మికులుగా దుర్భర జీవితం సాగిస్తున్నవారికి 'ఆపరేషన్ స్మైల్' భరోసాగా నిలుస్తోంది. జిల్లా సంక్షేమశాఖ, కార్మికశాఖ, బాలల సంరక్షణ బృందాలు, పోలీస్ విభాగం, చైల్డ్‌లైన్ (1098) బృందాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి.

జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో..

జిల్లా సంక్షేమశాఖ అధికారి సమన్వయంతో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ (1098), బాలల సంక్షేమ సమితి, ప్రత్యేక బాలల పరిరక్షణ విభాగం, జాతీయ బాల కార్మిక విభాగాల సమన్వయంతో బాలకార్మికులను గుర్తిస్తారు. ఆపరేషన్‌స్మైల్‌లో భాగంగా జనవరి 1 నుంచి 31 వరకు బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తిని కల్పిస్తారు. జిల్లాలో ఇప్పటివరకు మూడేళ్లుగా 235 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్, స్మైల్‌తో..

జిల్లాలో కార్మికులుగా మారుతున్న 18 ఏళ్ల లోపు బాల, బాలికలను గుర్తించి వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించి భవిష్యత్‌కు భరోసాను కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌ల ఉద్దేశం. ఈ కార్యక్రమంలో బాల కార్మికులను గుర్తించేందుకు జిల్లా పరిరక్షణ విభాగం(డీసీపీయూ), పోలీస్, చైల్డ్‌లైన్ (1098), లేబర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లు కలిసి జనవరి 31 వరకు 11 విడతలుగా ఆపరేషన్ చేపట్టారు. బాలల చేత పనులు చేయిస్తున్న యాజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు వీధి బాలలను, తప్పిపోయిన బాలలను, పనులు చేస్తున్న బాల కార్మి కులను గుర్తించి విముక్తి కలిగిస్తారు. ఆపరేషన్ ముస్కాన్‌తో జూలై 1 నుండి 30 వరకు, ఆపరేషన్ స్మైల్‌తో జనవరి 1 నుంచి 31 వరకు బాల కార్మికులను గుర్తించి వారి భవిష్యత్‌ను సంరక్షిస్తారు. ఇలా పట్టుబడిన బాలలను ఆరు నెలల వ్యవధిలో సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద బాల సహాయక కిట్లు ఇవ్వడంతో పాటు వారి సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వమే చూసుకుంటుంది.

మూడేళ్లలో ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ అమలు ఇలా..

ఏడాది	రక్షించిన		
	బాలురు	బాలికలు	మొత్తం
2022 ఆపరేషన్ స్మైల్	30	05	35
2022 ఆపరేషన్ ముస్కాన్	56	12	68
2023 ఆపరేషన్ స్మైల్	22	09	31
2023 ఆపరేషన్ ముస్కాన్	28	05	33
2024 ఆపరేషన్ స్మైల్	14	07	21
2024 ఆపరేషన్ ముస్కాన్	21	02	23
2025 ఆపరేషన్ స్మైల్	03	01	04
మొత్తం	174	41	215

పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం..



బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలను చేపట్టాం. బాల కార్మికులుగా మారుతున్నవారికి బంగారు భవిష్యత్ ఇవ్వడం కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఏటా ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి బాల కార్మికులను గుర్తిస్తున్నాం. ఈ ఆపరేషన్ స్మైల్ జనవరి 31 వరకు కొనసాగుతుంది. ఇప్పటివరకు జిల్లాలో ఎందరో బాల కార్మికులను గుర్తించి భరోసా కల్పించాం.

– స్వర్ణలతా లెనీనా, జిల్లా సంక్షేమశాఖ అధికారి

వనం వీడి జనంలోకి రండి..

- మావోయిస్టులకు ఎస్పీ సూచన
- మావోయిస్టుల కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల: వనం బాట పట్టిన మావోయిస్టులంతా జనంలోకి వస్తే మిగిలిన శేష జీవితమంతా సంతోషంగా గడపవచ్చని, ప్రభుత్వం కూడా సహాయ, సహకారాలు అందిస్తుందని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. శనివారం చర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ రాజువర్మ నేతృత్వంలో అజ్ఞాత దళ సభ్యుల కుటుంబ సభ్యులు, మావోయిస్టు పార్టీని వీడిన దళ సభ్యులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఓఎస్డీ (ఆపరేషన్స్) పరితోజ్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడారు. మావోయిస్టు పార్టీ కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయకులైన ఆదివాసీల జీవితాలతో ఆడుకుంటోదని, అమాయకులైనవారిని పార్టీలో చేర్చుకొని, వారి భవిష్యత్‌ను నాశనం చేస్తోందన్నారు. ఆదివాసీలను మోసం చేస్తున్న మావోయిస్టులు ఏ గ్రామానికైనా రోడ్డు వేశారా? తాగునీటి సౌకర్యం కల్పించారా? వైద్య సదుపాయం కల్పించారా? అని ప్రశ్నించారు. ఏడాది కాలంలో 36 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారందరికీ ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పించామని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, నర్సింగ్, బీటెక్ వంటి ఉన్నత చదువులు చదివి ఉపాధి లేకుండా ఉన్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, అలాంటి వారు ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గానీ, భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో గానీ లేదా నేరుగా తనను గానీ కలిస్తే ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చెన్నాపురం, పూసుగుప్ప గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో వైద్యశాలలను నిర్మించామని, త్వరలోనే అన్ని రకాల పరీక్షలకు సంబంధించిన మిషనరీతో పాటు ఎంబీబీఎస్ స్థాయి వైద్యులను నియమించి 24 గంటలూ వైద్య సేవలు అందించడంతో పాటు అంబులెన్సులను కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సంద ర్భంగా చర్ల మండలంలోని ఎర్రంపాడు, రాళ్లాపురం, బట్టిగూడెం గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు మావోయిస్టు పార్టీలో పని చేస్తుండగా వారి తల్లిదండ్రులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేశారు.

22 మంది లొంగుబాటు..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాలోని ఎర్రపల్లి, సాకిలేరు, జబ్బగట్ట, దూలేడు తదితర గ్రామాలకు చెందిన ఐదుగురు గ్రామ కమిటీ (ఆర్‌పీసీ) సభ్యులు, నలుగురు డీఏకేఎంఎస్ సభ్యులు, 11 మంది మిలీషియా కమిటీ సభ్యులు, ఒక కేఎంఎస్, సభ్యుడు, ఒక సీఎన్‌ఎం సభ్యుడు మొత్తం 22 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట లొంగిపోయారు. వీరందరికీ ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పిస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రాజ్‌కుమార్, సీఐ అశోక్, ఎస్ఐ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గాల దాడిని ప్రతిఘటించాలి



విలీన సభలో మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ

సింగరేణి(కొత్తగూడెం): ఉత్పత్తి శక్తులైన కార్మికులు, రైతులపై పాలక వర్గాల దాడిని ప్రతిఘటించాలని, 8 గంటల పనిదినం, కార్మిక చట్టాల పరిరక్షణకు కార్మిక వర్గం సమరశీల ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొత్తగూడెంక్లబ్‌లో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ, ఐ.కృష్ణ అధ్యక్షతన జరిగిన విలీన సభలో ఆమె మాట్లాడారు. 8 గంటల పనివిధానాన్ని 12 గంటలుగా మార్చాలన్న లక్ష్యంతో ఇటీవల ఎల్ఎన్‌డీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం వారానికి 90 గంటలు పనిచేయాలని సిఫార్సు చేశాడన్నారు. దేశంలో ఫాసిజం పెరుగుతోందని, పార్లమెంటరీ, రాజ్యాంగ బద్ధ సంస్థల విధ్వంసం జరుగుతోందని తెలిపారు. 1978లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఏర్పడిందని, కార్మిక క్షేత్రంలో ఇదో చారిత్రక పరిణామమని, కార్మిక వర్గం వివిధ ట్రేడ్ యూనియన్ల కింద పాలకవర్గ పార్టీలతో జతకట్టటం లేదా రాజీ మార్గంలో పయనిస్తూ కార్మిక పోరాటాలను వారి ప్రయోజనాలను బలహీన పరుస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాలతో విప్లవ కార్మిక సంఘమై ఐఎఫ్‌టీయూ ఆవిర్భవించిందని వివరించారు. కాగా, తొలుత కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అపర్ణ, సాధినేని వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించారు.కార్యక్రమంలో డీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్, ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షులు బి.ప్రదీప్, ప్రసాద్, శ్రీనివాస్, జే.సీతారామయ్య, కొక్కు సారంగపాణి, నెమ్మెళ్ల సంజీవ్, ఎండీ రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ప్రతిభతో ఎదగాలి



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

పాల్వంచరూరల్: క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌లో ముల్కలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు అందించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హెచ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వివేక్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డితోపాటు పి.శంకర్, ఎన్.శేషుబాబు, కె.రమేశ్, వి.నర్సింహకుమార్, ఎస్‌కే సాబిర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, విసంశెట్టి పూర్ణచందర్‌రావు, ముత్యాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఏడుగురు అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఏడుగురు అధికారులను బదిలీ చేస్తూ శనివారం రాత్రి సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. డీవైజీఎం, కాలరీస్ మేనేజర్, అడిషనల్ మేనేజర్, డీవైఎస్ఈ, జేఎంఈ, అండర్ మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ అధికారులు బదిలీ అయిన వారిలో ఉన్నారు. వీరంతా ఈ నెల 28వ తేదీలోపు వారికి కేటాయించిన ఏరియాల్లోని విభాగాల్లో చేరాలని యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులోని ప్రగతి మైదానంలో రూ.20 లక్షలు, రూ.25 లక్షలతో చేపట్టనున్న ఎంపవర్‌మెంట్ సెంటర్ అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, సాబీర్‌పాషా, పుల్లయ్య, శేషాంజన్ స్వామి, రవీందర్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఖాళీ చేయించిన అధికారులు

స్వల్ప ఉద్రిక్తత.. పోలీసులతో వాగ్వాదం



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న డీటీ వాణి, ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి

దమ్మపేట: మండలంలోని మల్లారం గ్రామ శివారులో అసంపూర్తి డబుల్ బెడ్రూంలను ఆవాసాలుగా మార్చుకున్న పేదలను డీటీ వాణి.. పోలీసుల సాయంతో ఖాళీ చేయించారు. మల్లారం శివారులో పునాదిపై పిల్లర్లు మాత్రమే నిర్మించి, అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూంలను సుమారు 40 మంది పరిసర ప్రాంత పేదలు ఆక్రమించుకున్నారు. నివా స యోగ్యంగా మార్చుకున్న విషయం విదితమే. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీటీ నివాసాల వద్దకు చేరుకుని, ఖాళీ చేయాలని సూచించారు. ఎలాంటి నివాసం లేని, నిరుపేదలమైన తాము ఖాళీ చేయలేమని గట్టిగా బదులిచ్చారు. దీంతో ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి, బలవంతంగా ఖాళీ చేయించా రు. ఓ ఇద్దరు డీజిల్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళన చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఆక్రమణదారులను పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోగా, వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అలా దోచేస్తున్నారు..

పాల్వంచలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పలువురు..

పాల్వంచ: ప్రజల అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరా చేసుకుని కొందరు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ సులువుగా డబ్బు దోచేస్తున్నారు. తాజాగా పాల్వంచలో ఓ సైబర్ నేరగాడు చాకచక్యంగా నగదు దోచేస్తుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వెడ్డింగ్ ప్లాట్‌ఫామ్ ఆర్గనైజర్స్‌ను టార్గెట్ చేసుకుని సుమారు పది మంది వద్ద చోరీకి పాల్పడటం చర్చనీయాంశమైంది. పాల్వంచలోని ఓ పెద్ద ఫంక్షన్‌హాల్‌లో త్వరలోనే తన కూతురి వివాహం ఘనంగా చేస్తున్నానని, ముందు పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్ హాల్‌లో ఎంగేజ్‌మెంట్ ఉందని, ఫొటోగ్రఫీ, డెకరేషన్, క్యాటరింగ్ కోసం బేరసారాలు ఆడి నమ్మించాడు. అందుకు వచ్చి అడ్వాన్స్‌లు తీసుకెళ్లాలని చెప్పాడు. కొంత సమయం తర్వాత మళ్లీ ఫోన్ చేసి తన ఖాతాలో లిమిట్ అయిపోయిందని, అర్జంట్‌గా వేరే ఖాతాలోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని, ఇంటికి వచ్చాక వివాహ వేడుకకు సంబంధించిన అడ్వాన్స్‌తో పాటు ఈ డబ్బులు ఇస్తానని నమ్మించాడు. దీంతో ఈవెంట్ కోసం ఆశపడిన సుమారు పది మంది రూ.2,500 నుంచి రూ.6 వేల వరకు డబ్బులు కొట్టారు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యాక ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. కేటుగాడి ఉచ్చులో పడి మోసపోవడం తమ వంతైందని బాధితులు తలలు పట్టుకుంటున్నారు.

ట్రావెల్స్ నిర్వాహకుడికి..

ఇదిలా ఉండగా ఇటీవల బీసీఎంరోడ్‌లోని ట్రావెల్స్ నిర్వాహకుడికి ఫోన్ చేసి తాను రెడ్డీస్ హాస్పిటల్‌లో ఉన్నామని, అర్జెంట్‌గా ఆస్పత్రిలో డబ్బులు వేయాలని, నగదును వ్యక్తి వచ్చి ఇస్తాడని, డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినందుకు పదిశాతం కమీషన్ కట్ చేసుకోమని నమ్మబలికాడు. దీంతో అతను ఎదురుగా వ్యక్తి వచ్చి ఉండటంతో వెంటనే ఖాతాకు రూ.90 వేలు నగదు ఫోన్‌పే చేశాడు. ఎదుట వ్యక్తిని డబ్బులు ఇవ్వమని చెప్పగా తనకే మీరు రూ.9 వేలు బిర్యానీ బిల్లు ఇస్తారని అడ్రస్ చెప్పడంతో వచ్చానని చెప్పడంతో ఇద్దరు మోసపోయినట్లు గుర్తించారు. దీంతో రూ.90 వేలు బదిలీ చేసిన వ్యక్తి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేసులు నమోదు

ఇల్లెందు: పురుగులమందు తాగిన పట్టణంలోని స్టాట్‌ఫిట్‌బస్తీకి చెందిన వ్యక్తి ఆస్పత్రిలో మృతిచెందగా.. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్టాట్‌ఫిట్‌బస్తీకి చెందిన ఇర్ప రాంబాబు (49)ను తీవ్ర అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో జీవితం మీద విరక్తి చెందిన ఆయన రెండు రోజుల కిందట పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సందీప్ శనివారం కేసు నమోదు చేశారు.

దూషించిన వ్యక్తిపై...

మండలంలోని ముకుందాపురానికి చెందిన ఎండీ సలీంను అదే గ్రామానికి చెందిన గొగ్గెల రామకృష్ణ దూర్భాషలాడాడు. సలీం ఫిర్యాదతో విచారణ చేసిన సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


వ్యక్తిపై దాడి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎంసీకాలనీకి చెందిన అల్లాడి జయరాజ్‌పై శనివారం సాయంత్రం చర్ల రోడ్డులో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. జయరాజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. దాడికి సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జయరాజ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మండలంలోని మూకమామిడి శివారులోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందగా దాడి చేసి, ఇసుక తోలుతున్న ట్రాక్టర్ సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని గిర్దావర్–2 భద్రు తెలిపారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మృతి



సెల్యూకాస్ (ఫైల్)

ఖమ్మంస్పోర్ట్స్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సంఘం కోశాధికారి కేతు సెల్యూకాస్ (45) గుండె పోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో శనివారం గుండెనొప్పి రాగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సెల్యూకాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన స్వస్థలం పాల్వంచ కాగా కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ బ్యాటరీలు, ఇన్వర్టర్ల ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్నారు. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడైన సెల్యూకాస్ దశాబ్ద కాలంగా జిల్లాలో అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తూ క్రీడాకారులకు చేయూతనిస్తున్నారు. ఆయన మృతిపై డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పుట్టా శంకరయ్య, కె.ఆదర్శ్‌కుమార్, కె.క్రిస్టోఫర్ బాబు, రఘునందన్, షఫీ, ఉప్పల్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

గుంతలో పడి వ్యక్తి...

పినపాక: మద్యం మత్తులో ఎర్రగుంట అడవిలోని గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పగిడేరు గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పగిడేరు గ్రామానికి చెందిన కుంజా నరేశ్ (35) గత నెలలో మద్యం మత్తులో ఎర్రగుంట అడవిలోకి వెళ్లాడు. మద్యం మత్తులో గుంతలో పడిపోయాడు. శనివారం ఉదయం అడవిలోకి వెళ్లిన కొందరు నరేశ్ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

లోన్‌యాప్ వేధింపులు తాళలేక ఆత్మహత్య?



సంతోష్‌లోధ్ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీ 4వ వార్డుకు చెందిన సంతోష్‌లోధ్ పురుగులమందు తాగి ఖమ్మంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. సంతోష్‌లోధ్ లోన్ యాప్‌లో రూ.90 వేల వరకు రుణం పొందారు. కొంతకాలం వరకు సక్రమంగా చెల్లించాడు. సుమారు రూ.40 వేలు చెల్లించిన తర్వాత అనారోగ్యం బారిన పడి రుణం చెల్లించలేదు. దీంతో లోన్ యాప్ ఏజెంట్లు దూషిస్తూ బెదిరించటం మొదలు పెట్టారు. ఫోన్ ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారు. లోన్ చెల్లించకపోతే కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి అందరికీ పంపిస్తామని బెదిరించటంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్‌లోధ్ మృతిచెందాడు.